క్లుప్తంగా

'ఆదర్శ'లో ప్రవేశాలకు గడువు పెంపు

కుంటాల: 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి ఈనెల 20 తేదీ వరకు గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ కాసు నవీన్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆరో తరగతిలో 100 సీట్లు ఖాళీగా ఉన్నాయని.. ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు ఖాళీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 20న ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని.. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన ఎల్లమ్మ జాతర



ఎల్లమ్మ నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

కుభీర్: మండలకేంద్రంలో ఎల్లమ్మ ఆలయంలో జరుగుతున్న జాతర ఉత్సవాలు ముగిశాయి. చివరిరోజైన మంగళవారం ఎల్లమ్మ కల్యాణం, గావుపట్టుట, అన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గీత పారిశ్రామిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక

భైంసారూరల్: భైంసా మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధిహామీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనులపై ప్రజావేదికలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ అంతరాయంతో ఇక్కట్లు

ఖానాపూర్: పట్టణంలో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నెలకొన్న విద్యుత్ అంతరాయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీలైన్ మార్పిడి అత్యవసరం ఉండడంతో సరఫరా నిలిపివేశామని ఏఈ రాంసింగ్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వవిద్యార్థులు

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. దిలావర్‌పూర్ గ్రామంలోని బద్దిపోచమ్మ ఆలయం వద్ద 1997–98లో పదోతరగతి చదివిన విద్యార్థులు కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుని ఉల్లాసంగా గడిపారు. పూర్వ విద్యార్థి తోవిటి జగన్ సొంతంగా బ్యాచ్ పేరిట పాఠశాలలో వసంత పంచమి రోజు సరస్వతిదేవీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో మిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

కడెం:మండలంలోని ధర్మాజీపేట్ పంచాయతీ పరిధిలోని పాతరేవోజీపేట్ గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. నూతన ఆలయం వద్ద వేద పండితులు చిన్ననర్సయ్య, ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు, యజ్ఞాలు, గణపతి, నవగ్రహ పూజలు ఇతర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు.

విహారయాత్రలో విద్యార్థులు

సోన్: విహారయాత్రలో భాగంగా సోన్ మండలంలోని కడ్తాల్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం నిర్మల్‌లో పర్యటించినట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం రమేశ్‌బాబు తెలిపారు. కొయ్య బొమ్మల పరిశ్రమ, సమీకృత కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, పాలిటెక్నిక్ కళాశాల, అయ్యప్ప ఆలయాన్ని విద్యార్థులు సందర్శించారని పేర్కొన్నారు. ప్రభాకర్, విజయవాణి, మంగమ్మ, రాధ, జ్యోతి, మధ్యాహ్న భోజన సిబ్బంది పాల్గొన్నారు.

సీఐటీయూలో పలువురి చేరిక

తానూరు: ముధోల్ మండలం విఠోలి గ్రామంలో ముధోల్ అంగన్‌వాడీ ప్రాజెక్టు సమావేశాన్ని మంగళవారం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు సీఐటీయూలో చేరారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 17,18 తేదీల్లో కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట ధర్నా, రాత్రి బస, వంటావార్పు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

కార్యవర్గం ఎన్నిక ...

ముధోల్ అంగన్‌వాడీ ప్రాజెక్టు కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రజియా బేగం, ఉపాధ్యక్షురాళ్లుగా వనిత, శ్రీదేవి, కార్యదర్శిగా రేష్మ, సహాయ కార్యదర్శులుగా నరసమ్మ, వాణి, లక్ష్మి, సవిత, కోశాధికారిగా మీనాక్షి ఎన్నికయ్యారు.

కాంగ్రెస్‌తో సొంతింటి కల సాధ్యం

• ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్



కడెం : నర్సాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

కడెం: పేదప్రజలకు సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని రైతువేదికలో 58మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం నర్సాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తే.. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి పేదలకు సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో అరుణ, ఎంపీవో సుజాత, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, సతీశ్‌రెడ్డి, భూషణ్, గంగన్న, చంద్రశేఖర్, శ్రీనివాస్, మల్లేశ్, రమేశ్‌రావు, రాజు, భూమేశ్, లచ్చన్న, లక్ష్మణ్, తదితరులున్నారు.

దశలవారీగా అర్హులకు ఇళ్లు

ఖానాపూర్: మండలంలోని అడవి సారంగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు భూమిపూజ చేశారు. అవినీతి, పైరవీలకు తావు లేకుండా అర్హులకు దశలవారీగా ఇళ్లు అందిస్తామని పేర్కొన్నారు. అంతకు ముందు ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. దయానంద్, సత్యం, రమేశ్, లింగు, భీంరావు, సంతోష్, శంకర్, రాజేశ్వర్, రాజన్న తదితరులు ఉన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని వేడుకోలు..

దస్తురాబాద్: తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని మండలంలోని ఆకొండపేట పంచాయతీలోని గోండుగూడవాసులు ఎమ్మెల్యే బొజ్జుకు విన్నవించారు. మండల కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యేను గ్రామస్తులు కలిశారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని ఆదివాసీలకు హామీ ఇచ్చారు.

దస్తురాబాద్ రైతువేదికలో ఎమ్మెల్యే బొజ్జు 30 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఎండలు పెరుగుతున్నందున ఉపాధి పనులకు వెళ్లే కూలీలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం పీఎం శ్రీ పథకంలో భాగంగా దస్తురాబాద్ కేజీబీవీలో రూ.2కోట్ల 30లక్షలతో నిర్మించే అదనపు తరగతి గదులకు భూమిపూజ చేశారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్నందుకు ఎమ్మెల్యేను ఎంఈవో గంగాధర్, ఉపాధ్యాయులు సన్మానించారు. తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఎంపీడీవో రమేష్, రమేశ్‌రావ్, వెంకన్న, శివయ్య, అంజన్న, గోపి తదితరులు పాల్గొన్నారు.

పెంబి: మండలంలోని పస్పులలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే బొజ్జు భూమిపూజ చేశారు. ఎంపీడీవో రమాకాంత్, తదితరులు ఉన్నారు.

గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

• బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సోన్‌లో పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

మామడ: ఎన్నికల వేళ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మామడలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మోడల్ ఇందిరమ్మ హౌస్ నిర్మాణ పనులు ప్రారంభించారు. రైతుభరోసా, గృహలక్ష్మి పథకాలతోపాటు నూతన పింఛన్లు ఇవ్వడం లేదని ఆయన విమర్శించారు. బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్, సరికెల గంగన్న, బాపురెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రంజిత్ పాల్గొన్నారు.

సోన్‌లో శంకుస్థాపన..

సోన్: మండలకేంద్రంలో రూ.49లక్షలతో నిర్మించే కేజీబీవీ భవన ప్రహరీ నిర్మాణానికి మంగళవారం నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం 59 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు చేశారు. అంతకుముందు మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో డీఈవో రామారావు, మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రత్యేకాధికారి, ఏడీ సుదర్శన్‌నాయక్, తహసీల్దార్ మల్లేశ్, ఎంపీడీవో సురేశ్, డీఈ తుకారం, డీసీడీవో సలోమి కరుణ, ఎస్‌ఓ లతాదేవి, ఎంపీఓ ఖలీల్ హైమద్, బీజేపీ మండలాధ్యక్షుడు మార గంగారెడ్డి, సరికెల గంగన్న, హరీశ్‌రెడ్డి, జక్క రాజేశ్వర్, సాగర్ నాగయ్య పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. మండలంలోని పొట్టపెల్లిలో రూ.10 లక్షలతో చేపట్టే సీసీ పనులకు, శివాజీ విగ్రహానికి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఢిల్లీలో గెలిచిన వెంటనే మహిళలకు నెలకు రూ.2500 ఇస్తున్నామన్నారు. ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కావొస్తున్నా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం లేదన్నారు. పొట్టపెల్లి(కె)లో దుర్గామాత ఆలయం షెడ్డు కోసం రూ.2.50 లక్షలు, మాల సంఘం, పద్మశాలి సంఘం భవనాలకు రూ.2 లక్షలు, ఎస్సీ కాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి రూ.15 లక్షలు, ఎల్లమ్మ ఆలయం కోసం నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. తహసీల్దార్ జానకీ, ఎంపీడీవో రాధ, ఎంపీవో అమీర్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, సత్యనారాయణగౌడ్, మండల అధ్యక్షుడు చిన్నయ్య, అడ్వాల రమేశ్, భూపాల్‌రెడ్డి, ముత్యంరెడ్డి, జీవన్‌రెడ్డి, రవి, రాంరెడ్డి, రాజేశ్వర్, నర్సారెడ్డి, రంజిత్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సిబ్బందికి అభినందన

మండలంలోని పొట్టపెల్లి నర్సరీలో పూల, ఔషధ, పండ్ల మొక్కలను పెంచుతున్నందుకు ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పర్యటనలో నర్సరీ వద్దకు వచ్చి డ్రాగన్, బ్లాక్ బెర్రీ వంటి మొక్కలు పెంచుతుండటంతో ఎంపీడీవో రాధ, కార్యదర్శి ప్రియాంకరెడ్డి, సిబ్బందిని అభినందించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

• డీఆర్డీవో విజయలక్ష్మి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో విజయలక్ష్మి

దిలావర్‌పూర్: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. మండలకేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయా మండలాల స్వయం సహాయక సంఘాల మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నిషేధం గురించి వివరించారు. కిశోర బాలికలకు స్వీయరక్షణ, చట్టాలపై అవగాహన కల్పించారు. నేటి సమాజంలో స్త్రీ పాత్ర, నిర్వర్తించాల్సిన బాధ్యతలపై సూచనలు సలహాలు అందజేశారు. డీపీఎం వెంకటసాయి, మండలాల ఏపీఎంలు, సీసీలు, సిబ్బంది మహేశ్, గంగాధర్, సుధాకర్ పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు



భోసిలో నర్సరీ పరిశీలిస్తున్న ఏపీవో గంగాధర్

తానూరు: గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం వద్దని ఏపీవో గంగాధర్ అన్నారు. మంగళవారం మండలంలోని మహలింగి, బామ్ని, బామ్నితండా, భోసి, బెల్‌తరోడా గ్రామాల్లో పర్యటించారు. నర్సరీలను పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా చూడాలని సూచించారు. గ్రామాల్లోని సెగ్రిగేషన్ షెడ్డులో సేంద్రియ ఎరువు తయారు చేయించడంతోపాటు ప్రజలు ఉపాధి పనులకు వచ్చేలా చూడాలని పేర్కొన్నారు. ఆయన వెంట టీఏ శివరాజ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా సంరక్షణ చర్యలు చేపట్టాలని ఎంపీడీవో రమేశ్ సూచించారు. మంగళవారం మండలంలోని బుట్టాపూర్ గ్రామంలో నర్సరీ, డంపింగ్‌యార్డును పరిశీలించారు. మొక్కల్లో ఎదుగుదల లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శి రవీందర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంలో పురోగతి కనిపించాలని సూచించారు. అనంతరం పంచాయతీ రికార్డులు పరిశీలించారు. వారి వెంట ఎంపీవో రమేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

వార్షికోత్సవం

లోకేశ్వరం: మండలంలోని భాగాపూర్ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం వార్షికోత్సవం నిర్వహించారు. శాంతిపఠం, దేవతాజ్ఞ మహాసంకల్పం, గణపతి గౌరిపూజ, స్వస్తి పుణ్యాహవచనం, ధ్వజరోహణం, గోపూజ, యాగశాల ప్రవేశం, నవగ్రహ పూజలను వేదపండితులు సంతోష్‌జోషి జరిపించారు. భక్తులు పూజలు చేశారు.

రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలి

లోకేశ్వరం: చెత్తాచెదారం లేకుండా గ్రామాల్లోని రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని హవర్గ గ్రామంలోని మురుగుకాల్వలు, పల్లె ప్రకృతివనం, నర్సరీలను ఎంపీడీవో పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలు ఎండిపోకుండా నీరందించాలన్నారు. పారిశుధ్య సిబ్బంది వేర్వేరుగా సేకరించిన తడి, పొడి చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి సేంద్రియ ఎరువు తయారు చేయాలని పేర్కొన్నారు. ఏపీవో జగన్నాథ్, ఎఫ్‌ఏలు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

ఖానాపూర్: వేసవికాలం దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా పంచాయతీ అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని డీఎల్‌పీవో రిజ్వాన్ అన్నారు. మంగళవారం మండలంలోని తర్లపాడ్ గ్రామంలో పర్యటించారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఎంపీవో రత్నాకర్ రావు, కార్యదర్శి రిజ్వానా తదితరులు ఉన్నారు.

సర్వే పరిశీలన

ఖానాపూర్: ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి కార్యక్రమాల నిర్వహణలో భాగంగా మంగళవారం మండలంలోని గోసంపల్లె ప్రాథమిక పాఠశాల, పాతఎల్లాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో జరుగుతున్న శాంపుల్ సర్వేను ఎంఈవో ప్రేంసాగర్ పర్యవేక్షించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రమాదేవి, సీఆర్పీ వనిత తదితరులున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

సారంగపూర్: విద్యార్థి దశ నుంచే పొదుపు అలవర్చుకోవాలని ఎస్‌బీఐ ప్రతినిధి కల్పన అన్నారు. బాలశక్తిలో భాగంగా మంగళవారం మండలంలోని జామ్ సాంఘీక సంక్షేమశాఖ బాలికల గురుకులంలో ఎస్‌బీఐ సారంగాపూర్ బ్రాంచి ప్రతినిధి కల్పన, సీఎఫ్ఎల్ సిబ్బంది ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ సంగీత, రాంసింగ్, సాయినాథ్ తదితరులు ఉన్నారు.

దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తా

• ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

కుభీర్: దశలవారీగా గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. తన హయాంలో విద్య, వైద్యంతోపాటు రోడ్లు, నీటి సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని వివరించారు. మంగళవారం ఆయన మండలంలోని దొడర్నా నుంచి మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన వాసి వరకు ఎస్‌డీఎఫ్ నిధులు రూ.7.68కోట్లతో చేపట్టే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆయన వెంట మండల మాజీ అధ్యక్షుడు బోయిడి విఠల్, విగ్నేష్, మాజీ జెడ్పీటీసీ రమేశ్, మాజీ సర్పంచ్ రాథోడ్ శంకర్, బీజేపీ నాయకులు పి.గంగాధర్, దత్తాత్రి, గంగాశేఖర్, కమ్‌లేశ్, అజయ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



వేడుకను తిలకిస్తున్న భక్తులు



కల్యాణం జరిపిస్తున్న పండితులు

భైంసాటౌన్: పట్టణంలోని పద్మావతి కాలనీలో ఉన్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామి వారి కల్యాణం వైభవంగా జరిపించారు. ముందుగా శ్రీదేవి–భూదేవి సహిత స్వామివారి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. వేడుకను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ సైతం హాజరై స్వామివారికి పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, విలాస్ గాదేవార్, గంగాధర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు సాదుల నారాయణ, సభ్యులు తదితరులున్నారు.

'బోధిగయను బౌద్ధులకే అప్పగించాలి'



ర్యాలీ తీస్తున్న బౌద్ధులు

భైంసాటౌన్: బీహార్ రాష్ట్రంలోని పవిత్ర స్థలమైన బోధిగయను బౌద్ధులకే అప్పగించాలని బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బోధిగయలోని మహాబౌద్ధవిహార్ నిర్వహణ, పూజలు హిందూధర్మ ఆచారాల ప్రకారం బ్రాహ్మణ పూజారుల ఆధీనంలో కొనసాగడం తమ మనోభావాలను కించపర్చేలా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా బోధిగయ నిర్వహణను బౌద్ధులకు అప్పగించాలని.. లేకుంటే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భైంసా డివిజన్‌లోని బౌద్ధులు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వారసంత.. అసౌకర్యాల చింత

- ప్రస్తుతం రోడ్లపైనే విక్రయాలు
- వాహనదారులకు తప్పని తిప్పలు
- నిర్వహణకు స్థలం కేటాయించాలంటున్న ప్రజలు



పై చిత్రంలో కన్పిస్తున్నది మండలకేంద్రం నుంచి చింతల్‌చాంద, చామన్‌పెల్లి, పార్‌పెల్లి, మల్లాపూర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డు. ఈ రోడ్డుపైనే లక్ష్మణచాందలో ప్రతి సోమవారం వారసంత కొనసాగుతుంది. సంతలో ప్రజలు గుమిగూడుతుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో మండలకేంద్రానికి వివిధ పనుల నిమిత్తం నిత్యం వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



కనకాపూర్‌లో రోడ్డుపై జరుగుతున్న వారసంతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

లక్ష్మణచాంద: మండలంలోని గ్రామాల్లో నిర్వహించే వారసంతల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో చిరువ్యాపారులు రోడ్లపైనే కూరగాయలు, నిత్యావసర సరుకులు, దుస్తులు, వ్యవసాయ పనిముట్లు ఇతర వస్తువులను విక్రయిస్తున్నారు. ప్రధాన రోడ్డుపై జరిగే వారసంతల కారణంగా ప్రజలు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఓ వైపు అన్ని వస్తువులు ఒకేచోట దొరకుతుండటంతో ప్రజలు గుమిగూడుతున్నారు. దీంతో సాధారణంగానే వారసంత సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

ఇబ్బందుల మధ్యనే..

మండలంలోని ఆయా గ్రామాల్లో వారసంతలు మంగళవారం మినహా మిగతా అన్ని రోజుల్లో ఏదో ఒకచోట జరుగుతున్నాయి. వారసంతల్లో ప్రజలు వివిధ వస్తువులు కొనుగోలు చేసే సమయంలో వాహనదారులు వెళ్లడం కష్టంగా మారింది. లక్ష్మణచాంద, కనకాపూర్‌తోపాటు బాబాపూర్, నర్సాపూర్, పీచర, పార్‌పెల్లి, రాచాపూర్ గ్రామాల్లోనూ వారసంతలు రోడ్లపైనే కొనసాగుతున్నాయి.

ప్రత్యేక స్థలం కేటాయించాలి..

అధికారులు స్పందించి వారసంతలకు ప్రత్యేక స్థలం కేటాయిస్తే ప్రజలకు ఇబ్బందులు తప్పనున్నాయి. వారసంతల్లో అన్ని వస్తువులు ఒకే చోట లభ్యమవుతున్నాయి. గతంలో ఏయే వస్తువు కావాలన్నా.. నిర్మల్ వెళ్లి తెచ్చుకునేవారు. ఇప్పుడు ఉన్న ఊరిలోనే అన్ని వస్తువులు దొరకుతున్నాయి. దీంతో సమయం ఆదా కావడంతోపాటు తాజా కూరగాయలు అందుతున్నాయి. కానీ ట్రాఫిక్ సమస్యలు మాత్రం తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించి వారసంతలకు ప్రత్యేక స్థలం కేటాయించి సౌకర్యాలు కల్పిస్తే ప్రజలకు ఇబ్బందులు దూరం కావడంతోపాటు పంచాయతీలకు ఆదాయం సమకూరుతోంది.

మండలంలో వారసంతలు ఇలా..

లక్ష్మణచాంద మండలంలో 18 గ్రామపంచాయతీల పరిధిలో 23 గ్రామాలున్నాయి. లక్ష్మణచాందలో సోమవారం, కనకాపూర్‌లో ఆదివారం, రాచాపూర్‌లో శనివారం, పీచరలో బుధవారం, బాబాపూర్, నర్సాపూర్ గ్రామాల్లో గురువారం, పార్‌పెల్లిలో శుక్రవారం వారసంతలు నిర్వహిస్తున్నారు.

కొన్నేళ్లుగా వస్తున్నా..



మండలకేంద్రంలో జరిగే వారసంతకు కొన్నేళ్లుగా వస్తున్నా. అప్పటినుంచి ఇప్పటివరకు ప్రధాన రోడ్డుపైనే వారసంత జరుగుతోంది. దీంతో చిరువ్యాపారులకు, ప్రజలకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. – శ్రీనివాస్, పీచర

ప్రభుత్వ స్థలం చూపాలి



వారసంతల నిర్వహణకు అధికారులు గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి సౌకర్యాలు కల్పించాలి. వీటితో పంచాయతీలకు ఆదాయం సమకూరుతోంది. ప్రస్తుతం రోడ్డుపై నిర్వహణతో ఇబ్బందులు తప్పడం లేదు. – భూమేశ్, పొట్టపెల్లి

న్యాయం చేయాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

లోకేశ్వరం: డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇప్పిస్తామని సేవాలాల్ తండా తాజా మాజీ సర్పంచ్ కుమారుడు, లక్ష్మీనగర్ తండాకు చెందిన ఓ వ్యక్తి కలిసి డబ్బులు వసూలు చేశారని మండలంలోని లక్ష్మీనగర్ తండావాసులు మంగళవారం తహసీల్దార్ మోతీరాంకు వినతిపత్రం అందించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌ను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. 17 మంది నుంచి రూ.లక్షా ఐదు వేలు వసూలు చేశారని.. డబ్బులు ఇవ్వాలని అడిగితే తమపై కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ జరిపి న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. వారి వెంట ఎంపీడీవో వెంకటరమేశ్, సర్వేయర్ ఉన్నారు.